నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 3 డిసెంబర్ 2024 | HYDERABAD

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని అధ్యయన కేంద్రాల్లో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమం చేస్తామని అంబేద్కర్ వర్సిటీ జేఏసీ సభ్యులు హెచ్చరించారు. విశ్వవిద్యాలయం స్థలాన్ని ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి కేటాయించాలనే ఆలోచనను వెనక్కి తీసుకోవాలన్నారు. 74వ రోజు..పరిపాలన భవనం ఎదుట సోమవారం ఉద్యోగులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ చైర్‌పర్సన్ పల్లవీ కాబడే, కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ డా.వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. - సిటీబ్యూరో

మధురానగర్ శిశు విహార్ సంరక్షణ కేంద్రంలోని పిల్లలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అధికారులు

నాడు నాచారం ఎస్టీపీ పనులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తదితరులు

కట్టిన ఇంటికి సున్నం వేసినట్లుగా..

ఒక్కొక్కటిగా తమ ఖాతాలో వేసుకుంటున్న కాంగ్రెస్

బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయిన ఎస్టీపీలు

ట్రయల్ రన్‌లో తుది మెరుగులు దిద్దిన యంత్రాంగం

నేడు ఆరు ఎస్టీపీలు, ఓఆర్ఆర్ ఫేజ్-2 రిజర్వాయర్లను ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

సిటీబ్యూరో, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): కట్టిన ఇంటికి సున్నం వేసినట్లుగా ఉంది కాంగ్రెస్ ప్రభుత్వ తీరు. హైదరాబాద్ విశ్వనగరానికి మరిన్ని మౌలిక వసతులు కల్పించాల్సిన సర్కారు ఏడాదిగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. కీలకమైన ప్రాజెక్టును పట్టాలెక్కించిన దాఖలాలు మచ్చుకైన కనబడుతలేదు. పైపెచ్చు ప్రజాపాలన విజయోత్సవాల పేరిట గత ప్రభుత్వ ప్రాజెక్టులను ప్రారంభించి మేమే చేసినట్లుగా గొప్పలు చెప్పుకునేందుకు సిద్ధమైంది. ఇందుకు నగరంలోని ప్రసాద్ ఐమాక్స్ థియేటర్ వద్దనున్న హెచ్ఎండీఏ గ్రౌండ్ వేదికైంది. నేడు జలమండలి ఆధ్వర్యంలో ఓఆర్ఆర్ ఫేజ్ -2లో 19 రిజర్వాయర్లు, ఆరు ఎస్టీపీలను సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం ప్రారంభించనున్నారు.

మురుగు శుద్ధి నగరంగా మార్చిన కేసీఆర్ ప్రభుత్వం

దేశంలోనే వందకు వంద శాతం మురుగునీటి శుద్ధి చేసే తొలి నగరంగా హైదరాబాద్‌ను నిలుపాలన్న గత కేసీఆర్ ప్రభుత్వం పూర్తి లక్ష్యం మరికొద్ది రోజుల్లో నెరవేరబోతున్నది. రోజూ ఉత్పన్నమయ్యే మురుగునీటిని వంద శాతం శుద్ధి చేయడానికి వీలుగా రూ. 3866.41 కోట్ల వ్యయంతో 1259.50 ఎంఎల్‌డీ సామర్థ్యంతో 27 కొత్త ఎస్టీపీలను చేపట్టి గత అక్టోబర్‌లో ఏడు చోట్ల ఎస్టీపీలు వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ క్రమంలోనే ఆరు ప్రాంతాలు నాగోల్, ఫతేనగర్, మిరాలం, ఖాజాకుంట, మియాపూర్-పటేల్ చెరువు, సఫిల్‌గూడ ప్రాంతాల్లో చేపట్టిన ఎస్టీపీలు పనులు పూర్తి చేసుకుని ట్రయల్ రన్ వరకు తీసుకువచ్చారు. తుది మెరుగులు దిద్దిన ప్రభుత్వం ఈ ఆరు చోట్ల ఎస్టీపీలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఇప్పటికే నల్లచెరువు, పెద్ద చెరువు ఎస్టీపీలను ప్రారంభించి తమ ఖాతాలో వేసుకున్న కాంగ్రెస్..తాజాగా ఆరు ఎస్టీపీలను మా ప్రభుత్వమే అందుబాటులోకి తెచ్చిందని చెప్పుకునే ప్రయత్నం చేస్తుండటం గమనార్హం.

అందుబాటులోకి వచ్చే ఎస్టీపీలు..

ఎస్టీపీ ప్రాంతం	సామర్థ్యం (ఎంఎల్‌డీలలో)
ఖాజాకుంట	20
సఫిల్‌గూడ	5.5
మిరాలం	41.5
మియాపూర్ పటేల్‌చెరువు	7.0
ఫత్తేనగర్	133
నాగోల్	320

ఓఆర్ఆర్ ఫేజ్-2లో 19 రిజర్వాయర్లు

దక్షిణాసియాలోనే ఏకైక నగరంగా..

హైదరాబాద్ మహానగరాన్ని ఒక విశ్వనగరంగా తీర్చిదిద్దాలనే ధృడ సంకల్పంతో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ నేతృత్వంలో జీహెచ్ఎంసీలో ప్రతి రోజు ఉత్పత్తి అయ్యే 20కోట్ల లీటర్ల మురుగునీటిని సంపూర్ణంగా శుద్ధి చేయాలనే ఉద్దేశంతో రూ.3866 వేల కోట్లతో 27 ఎస్టీపీలకు కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వచ్చే మూడు నెలల్లోగా మిగిలిన ఎస్టీపీలను అందుబాటులోకి రావడం ద్వారా దక్షిణ ఆసియాలోనే వందకు వంద శాతం సీవరేజ్ ట్రీట్‌మెంట్ చేసే ఏకైక నగరంగా హైదరాబాద్ నిలవనుంది. ఎస్టీపీల నిర్మాణంలో కేంద్రం ఒక్క పైసా ఇవ్వకుండా ఈ ప్రాజెక్టును సమర్థవంతంగా చేపట్టింది.

నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం హెచ్ సిటీ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. రూ.3,666.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. హెచ్ సిటీ ప్రాజెక్టు కింద రోడ్ల నిర్మాణ పనులు రూ.3,500కోట్లు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు 12 నిర్మాణాలకు రూ. 16.50 కోట్లు, రూ. 150 కోట్లతో 283 చోట్ల సుందరీకరణ పనులను ప్రారంభించనున్నారు. వీటితో పాటు ప్రతి సర్కిల్‌లో శానిటేషన్ కార్మికులకు స్క్రీనింగ్, హెల్త్ క్యాంపులు, ప్రతి సర్కిల్‌లో 2కె రన్, కొన్ని సర్కిళ్లలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు చేయనున్నారు.

రెయిన్ వాటర్ సంపుల డిజైన్లను మార్చండి

వరద నివారణ చర్యల్లో భాగంగా జీహెచ్ఎంసీ లేక్‌వ్యూ గెస్ట్ హౌజ్ వద్ద నిర్మిస్తున్న రెయిన్ వాటర్ సంపు పనులను సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వరద నివారణ చర్యలపై అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. రోడ్లపై వరద నీటిని మళ్లిస్తే నగరంలో ట్రాఫిక్‌ను తగ్గించవచ్చని చెప్పారు. వచ్చే వర్షాకాలం నాటికి అన్నీ చోట్ల పనులు పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. రెయిన్ వాటర్ సంపుల డిజైన్ మార్చాలని సూచించారు. హైదరాబాద్ వ్యాప్తంగా గుర్తించిన 141 వాటర్ లాగింగ్ పాయింట్స్ దగ్గర రెయిన్ వాటర్ సంపులను నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే దానం నాగేందర్, పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడే 19 రిజర్వాయర్లు ప్రారంభం..

శరవేగంగా విస్తరిస్తున్న నగరంలో ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా సమృద్ధిగా నీరందించేందుకు గత ప్రభుత్వం బాటలు వేసింది. ఔటర్ లోపల 193 గ్రామాలకు మెరుగైన నీటి సరఫరాకు గానూ రూ.750 కోట్లు ఖర్చు పెట్టి 164 రిజర్వాయర్లు, 1571 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేసి దాహార్తిని దూరం చేసింది. ఇదే సమయంలో ఔటర్ లోపల మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు తాగునీటిని అందించేందుకు గానూ రూ. 1200కోట్లతో ఓఆర్ఆర్ ఫేజ్-2 పనులు చేపట్టింది. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, మేడ్చల్, రాజేంద్రనగర్, కుత్బుల్లాపూర్, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో రెండు ప్యాకేజీలుగా విభజించి 73 రిజర్వాయర్ల పనులు చేపట్టి..దాదాపు ప్రాజెక్టును తుది దశకు చేర్చి ఎన్నికల ముందు 23 చోట్ల రిజర్వాయర్లను ప్రారంభించింది. నేడు 19 రిజర్వాయర్లను సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించి అందుబాటులోకి తేనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 25 లక్షల మందికి లబ్ధి జరగడంతో పాటు అదనంగా 1.50 లక్షల కొత్త నల్లా కనెక్షన్లు అందుబాటులోకి రానున్నాయి.

శిశు విహార్‌లో ప్రత్యేక క్యాంపులు

ధ్రువపత్రాల జారీ..

హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలోని ఎన్జీఓలు, శిశు విహార్ సంరక్షణ కేంద్రాల్లోని పిల్లలకు వారం రోజుల్లో అవసరమైన గుర్తింపు ధ్రువ పత్రాలను జారీ చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జీహెచ్ఎంసీ, రెవెన్యూ, మీ సేవలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి జారీ చేయాలని సూచించారు. మధురానగర్‌లోని శిశు విహార్ సంరక్షణ కేంద్రంలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి బర్త్, ఆదాయం, కుల ఇతర ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. సోమవారం ఈ క్యాంపును కలెక్టర్ సందర్శించి 8నెలల పాపకు బర్త్ సర్టిఫికెట్‌ను అందజేశారు. సంరక్షణ కేంద్రంలోని పిల్లల తల్లిదండ్రులు మరణిస్తే వారి ఆస్తులు పిల్లలకు చెందేలా రెవెన్యూ శాఖకు వివరాలు అందించాలన్నారు. జిల్లా సంక్షేమాధికారి అక్కేశ్వర్ రావు, ఆర్డీఓ సాయిరాం, డీసీపీఓ శ్రీనివాస్, తహసీల్దార్ నయూమ్ ఉద్దీన్ పాల్గొన్నారు.

ప్రీ లాంచ్ మోసాలు..

సామాన్యుల కష్టార్జితాన్ని నొక్కేస్తున్న కొందరు వ్యాపారులు

అరెస్ట్‌లతోనే సరిపెడుతున్న పోలీసులు

మాకు న్యాయం జరుగుతుందా? అని ఎదురు చూస్తున్న బాధితులు

కొన్ని కేసుల్లో నిందితులతో పోలీసులు మిలాఖత్ అవుతున్నారనే ఆరోపణలు!

సిటీబ్యూరో, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ప్రీ లాంచ్ ఆఫర్‌లో తక్కువ ధరకు ప్లాట్ వస్తుందనే ఆశతో సామాన్య ప్రజలు రియల్ ఎస్టేట్ వ్యాపారులను నమ్మి నిండా మునుగుతున్నారు. ఇల్లు, ఓపెన్ ప్లాట్, ఫ్లాట్ అనేది హైదరాబాద్‌లో ఎక్కడో ఓ దగ్గర ఉండాల్సిందే.. ఇప్పుడు ఆలస్యం చేస్తే ముమ్ముందు కొనే పరిస్థితి ఉంటుందో ఉండదోననే ఆందోళనతో చాలామంది ప్రీ లాంచ్ ఆఫర్‌కు ఆకర్షితులవుతున్నారు. మూడు, నాలుగేండ్ల క్రితం ప్రీ లాంచ్ ఆఫర్లలో పెట్టుబడులు పెట్టి మోసపోయిన వారు ఒక్కొక్కరుగా పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇలా ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో పది నెలల్లోనే పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. ప్రధానంగా వందల కోట్ల మోసం జరిగిన కేసులు పది వరకు ఉన్నాయి. సాహితీ ఇన్‌ఫ్రా, సాయి నిఖిత, భువనతేజ, ఈవీకే ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, బైబ్యాక్ పాలసీ పేరుతో సువర్ణభూమి, ఆర్-హోమ్స్(ఆర్‌జే హోమ్స్), సాయి సూర్య డెవలపర్స్, అర్బన్ వుడ్ రియాల్టీ ఎల్ఎల్పీ, జీఎస్ఆర్ ఇన్‌ఫ్రా తదితర సంస్థలు మోసం చేయడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేయడంతో కేసులు నమోదయ్యాయి. అయితే ఈ కేసుల దర్యాప్తునకు పోలీసులు నెలల సమయం తీసుకుంటున్నారు. కొన్ని కేసుల్లో నిర్వాహకులను అరెస్ట్ చేసిన పోలీసులు ఆ తరువాత దర్యాప్తు విషయం చూద్దాం లే అన్నట్లుగా నిదానంగా చేస్తున్నారనే విమర్శలున్నాయి. కొన్ని కేసుల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులతో పోలీసులు కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలున్నాయి. సాహితీ ఇన్‌ఫ్రాకు సంబంధించిన కేసులో హైదరాబాద్ సీసీఎస్ ఏసీపీతో పాటు మరికొందరు అధికారులపై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఇలా నిందితులతో కొందరు పోలీసులు మిలాఖత్ అవుతున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి.

ఆయా కేసుల వివరాలు ఇలా ఉన్నాయి...

- సాహితీ ఇన్‌ఫ్రా పై హైదరాబాద్ సీసీఎస్‌తో పాటు సైబరాబాద్, రాచకొండ, విజయవాడ ప్రాంతాల్లో పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. ఈ కేసును ఈడీ విచారిస్తుంది. సుమారు 2500 మంది బాధితుల వద్ద వెంచర్ల పేరుతో రూ. 3 వేల కోట్ల వరకు సంస్థ నిర్వాహకుడు బూదాటి లక్ష్మీనారాయణ వసూలు చేసి బిచాణా ఎత్తేశాడు. ఈ కేసు దర్యాప్తు బాధ్యతను సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు నిర్వహిస్తూ అటూ బాధితులు, ఇటూ సంస్థ యజమాన్యం వద్ద భారీగా వసూలు చేసేందుకు ప్లాన్ చేశాడు. ఇంతలోనే ఏసీబీ అధికారులు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. బాధితులు న్యాయం కోసం ఎదురు చూస్తున్నారు.
- శంకర్‌పల్లి మోకిలలో తక్కువ ధరకు విల్లా అంటూ ప్రీ లాంచ్ పేరుతో నారాయణగూడకు చెందిన కె.రాఘవేంద్రతో పాటు మరికొందరిని ఈవీకే ప్రాజెక్ట్స్ నిర్వాహకులు శ్రీనివాస్‌రావు, పద్మజ, వంశీకృష్ణ చౌదరి, అనూష, సమంత మోసం చేశారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్‌లో నమోదైన ఈ కేసు సీసీఎస్‌కు బదిలీ అయింది.
- బైబ్యాక్ పాలసీ పేరుతో సువర్ణ భూమి ఇన్‌ఫ్రా డెవలపర్స్ నిర్వాహకుడు బొల్లినేని శ్రీధర్, బొల్లినేని దీప్తి భారీ ఎత్తున అమాయకులతో ప్రీ లాంచ్ పేరుతో డబ్బులు వసూలు చేసి మోసానికి పాల్పడ్డారు. రూ. 35 లక్షలు పెట్టుబడి పెడితే రెండేండ్లలో రూ. 55 లక్షలు తిరిగి ఇవ్వడం.. లేదంటే ప్లాట్‌ను ఇస్తామంటూ నమ్మించి మోసం చేశారు. దీంతో ఇటీవల బాధితులు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.
- సెలబ్రిటీల ఫొటోలతో భారీగా ప్రకటనలు ఇచ్చిన ఆర్ హోమ్స్@ ఆర్జే హోమ్స్ నిర్వాహకులు భాస్కర్ గుప్త, ఆయన భార్య సుధారాణి నగరం నలు మూలలా వివిధ పేర్లతో వెంచర్లను ప్రారంభించారు. 2020 నవంబర్‌లో ఘట్‌కేసర్ ప్రాంతంలో జై వాసవీ బ్లిస్ హైట్స్ పేరుతో వెంచర్‌ను ప్రారంభించారు. ఇక్కడ సుమారు 600 మంది బాధితులు రూ. 150 కోట్ల వరకు చెల్లించారు. ఆ తరువాత ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా బాధితులను ఇబ్బందులు పెడుతుండటంతో సైబరాబాద్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు నిర్వాహకులను అరెస్ట్ చేశారు.
- ప్రముఖ సినీ హీరోను బ్రాండ్ అంబాసిడర్‌గా చూపిస్తూ గచ్చిబౌలిలోని సాయి సూర్య డెవలపర్స్ నిర్వాహకులు సతీశ్‌చంద్రగుప్త ఎన్ఆర్ఐకీ రూ. 3.63 కోట్ల మోసం చేశాడు. ఇతనితో పాటు పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.
- అర్బన్‌వుడ్ రియాల్టీ ఎల్ఎల్పీ సంస్థ నిర్వాహకుడు శ్రీనివాస్ మేక, గగన్‌దీప్ సింగ్ కోహ్లి పై సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కాజాగూడలో ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తున్నామని 18 నెలల్లో ప్రాజెక్ట్ పూర్తవుతుందంటూ పలువురి నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి మోసానికి పాల్పడ్డారు. సుమారు రూ.100 కోట్ల వరకు మోసం చేశారని బాధితులు పేర్కొన్నారు.

తలుపులు మూసి కౌన్సిల్ సమావేశం

రసాభాసగా బడంగ్‌పేట కార్పొరేషన్ సమావేశం

- ఆరోపణలు, ప్రత్యారోపణలతో దద్దరిల్లిన సభ
- బడ్జెట్ లేనప్పుడు తీర్మానాలు ఎందుకు?
- వార్షిక బడ్జెట్ ఎంతో తేల్చండి: కార్పొరేటర్ శంకర్
- మా డివిజన్లకు నిధులు ఎందుకు కేటాయించలేదు : కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి
- ప్రభుత్వ పాఠశాల టాయిలెట్స్‌కు నిధులేవీ : డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

బడంగ్‌పేట, డిసెంబర్ 2: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. సోమవారం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్‌లో బడ్జెట్‌పై సభ్యుల ఆరోపణలు, ప్రత్యారోపణలతో సమావేశం దద్దరిల్లింది. సభ్యుల మధ్య వాగ్వాదం తలెత్తడంతో సమావేశం గందరగోళంగా మారింది. సమావేశంలో జరుగుతున్న అంశాలు బయటకు పొక్కకుండా తలుపులు,కిటికీలు మూసి సమావేశం నిర్వహించారు. పక్కనే ఉన్న జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న విద్యార్థులకు అంతరాయం ఏర్పడింది. ఎజెండాలో 25 అంశాలను చర్చించడానికి కొత్తగా నంబర్ ఇవ్వడం పట్ల సభ్యులు ఇదేం పద్ధతి అని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.52 కోట్లకు తీర్మానాలు పెట్టగా.. వార్షిక బడ్జెట్‌కు విరుద్ధంగా తీర్మానాలు చేయడం పట్ల సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న బడ్జెట్ ఎంతో చెప్పాలని, తీర్మానాలు చేసిన పనులకు బడ్జెట్ ఎక్కడి నుంచి తీసుకొస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. టెండర్ లేకుండా పనులు చేస్తే బిల్లు ఎలా చెల్లిస్తారని వాదించారు. నిధుల కేటాయింపులో పక్షపాత ధోరణిపై సభలో గందరగోళం నెలకొన్నది. రాత్రి వరకు కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. 32 డివిజన్లలో కొంత మందికి మాత్రమే ఇష్టానుసారంగా నిధులు కేటాయించడం పట్ల సమావేశంలో సభ్యులు మండిపడ్డారు.

టెండర్ వేయకుండానే అడ్వాన్స్ పనులు : కార్పొరేటర్ శంకర్

టెండర్ వేయకుండానే అడ్వాన్స్ పనులు ఎలా చేస్తారని గుర్రంగూడ కార్పొరేటర్ దడిగ శంకర్ ప్రశ్నించారు. అసలు కార్పొరేషన్‌లో వార్షిక బడ్జెట్ ఎంతో తేల్చాలని పట్టుబట్టారు. మూడు కౌన్సిల్ సమావేశాల్లో రూ.160 కోట్ల బడ్జెట్ పెట్టారని తెలిపారు. అసలు బడ్జెట్ లేకుండా అడ్డగోలుగా పనులు చేస్తే ఎలా అన్నారు. కొంత మంది కార్పొరేటర్లకు కోట్ల నిధులు ఏ పద్ధతి ప్రకారం కేటాయిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.టెండర్ ప్రక్రియ లేకుండానే అడ్వాన్స్‌గా పనులు ఎలా చేయిస్తారని అధికారులను నిలదీశారు.

అవసరమైన వాటికి నిధుల్లేవ్ : డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో అవసరమైన వాటికి నిధులు కేటాయించకుండా అనవసరమైన వాటికి నిధులు కేటాయిస్తున్నారని డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్స్ ఏర్పాటు చేయడానికి నిధులు కేటాయించాలని ప్రతి సమావేశంలో తాను ప్రస్తావిస్తున్నప్పటికీ పట్టించుకోక పోవడం పై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కమ్యూనిటీ హాలుకు బదులు విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అన్ని డివిజన్లకు కోట్ల నిధులు కేటాయించి.. తన డివిజన్‌కు మాత్రం తక్కువ నిధులు కేటాయించారని కార్పొరేటర్ పెద్ద బావి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. సమావేశంలో కమిషనర్ సరస్వతి, కార్పొరేటర్లు, మేనేజర్ నాగేశ్వర్‌రావు, డీఈలు యాదయ్య, రాజు, జ్యోతి, ఏఈ వినీల్ గౌడ్ ఉన్నారు.

కౌన్సిల్ సమావేశం రసాభాస కావడంతో తలుపులు మూసి నిర్వహిస్తున్న దృశ్యం

వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్, ఏడీసీపీ జయరాం, ఏసీపీ శ్రీకాంత్

అద్దెకు కార్లు తీసుకుని మోసాలు

నలుగురు అరెస్టు, 21 కార్లు స్వాధీనం

కేసు వివరాలు వెల్లడించిన డీసీపీ వినీత్

శేరిలింగంపల్లి, డిసెంబర్ 2: సెల్ఫ్ ఓన్డ్ కార్లను అద్దెకు తీసుకొని కారు ఓనర్లను మోసం చేస్తున్నారు. కార్లను నెలల తరబడి ఇతరులకు అద్దెకిస్తున్న ఓ కిలాడీ లేడీతో పాటు మరో ముగ్గురు నిందితులను రాయదుర్గం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి దాదాపు 2.5 కోట్ల విలువ చేసే 21 కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలిలోని కార్యాలయంలో మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. గచ్చిబౌలి టెలికాంనగర్‌కు చెందిన జూపూడి ఉష నగరంలో పలువురి నుంచి అద్దెకు సెల్ఫ్ ఓన్డ్ కార్లను అద్దెకు తీసుకున్నది. కేవలం అడ్వాన్స్ రూపంలో నామమాత్రపు అద్దె చెల్లించింది. సదరు కార్లను ఓనర్లకు తెలియకుండా ఇతర వ్యక్తులకు అద్దెకు ఇస్తూ నెలల తరబడి కార్లను తనవద్దే ఉంచుకుంటూ మోసాలకు పాల్పడింది. ఇందుకోసం తన వద్ద డ్రైవర్‌గా పనిచేసే తుడుముల మల్లేశ్‌తో కలిసి అత్తాపూర్ చెందిన ప్రీ ఓన్డ్ కార్ల గ్యారేజ్ నడుపుతున్న సాగర్ పాటిల్, జామానే అనిల్‌కుమార్ సహాయంతో ఇతరులకు అద్దెకు ఇస్తుంది. పాటిల్, అనిల్ అద్దెకార్ల కోసం వచ్చిన వారిని ఉష, మల్లేశ్ ద్వారా కార్లు అద్దెకు ఇప్పించి మోసాలకు పాల్పడుతున్నారు. కార్లను బట్టి నెలకు లక్ష నుంచి రెండు లక్షల వరకు అద్దె తీసుకుంటున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు నవంబర్ 10న కేసు నమోదు చేసుకున్న రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితులు ఉష, మల్లేశ్, సాగర్ పాటిల్, అనిల్‌కుమార్‌లను అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా వీరి నుంచి 21 కార్లను రికవరీ చేశారు. నిందితులు మూడు నెలలుగా ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. మాదాపూర్ ఏడీసీపీ జయరాం, ఎసీపీ శ్రీకాంత్, రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న, డీఐ సతీశ్‌కుమార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.